సాక్షి
బాపట్ల
ఆదివారం । 22 । జూన్ । 2025



స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్
నరసరావుపేటరూరల్: జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవరణలోని చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.



నిమ్మకాయల ధరలు
తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1800, గరిష్ట ధర రూ.2600, మోడల్ ధర రూ.2200 వరకు పలికింది.

న్యూస్‌రీల్

జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



దుగ్గిరాల: మండలంలోని పెదకొండూరులో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని శనివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు సమర్థంగా నిర్వహించి, దేశ ఉప ప్రధానిగా ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా వీర్లపాలెం నుంచి పెదకొండూరు గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాలుస్తూ మందా కృష్ణని ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమాన్ని విగ్రహ కమిటీ పర్యవేక్షించింది.

విద్యుత్ పర్యవేక్షక ఇంజినీర్‌గా రమేష్ బాధ్యతల స్వీకరణ



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు సర్కిల్ విద్యుత్ శాఖ నూతన పర్యవేక్షక ఇంజినీరుగా పాన్నూరు రోడ్డులోని కార్యాలయంలో చల్లా రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన కేవీఎల్ఎన్ మూర్తి ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం జనరల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. రమేష్ కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ బదిలీపై గుంటూరు పర్యవేక్షక ఇంజినీరుగా వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు సర్కిల్‌ను కంపెనీలో ప్రథమ స్థానానికి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు.

పానకాలస్వామి ఆలయంలో భక్తుల కోలాహలం



మంగళగిరి: మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (పానకాల) ఆలయం శనివారం భక్తులతో రద్దీ మారింది. ఎగువ, దిగువ సన్నిధుల వద్ద కోలాహలం కనిపించింది. ఎగువ సన్నిధిలో భక్తుల రద్దీతో దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది.

వైకుంఠవాసుడికి ఊయల సేవ



తెనాలి టౌన్: స్థానిక శ్రీ లక్ష్మీపద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో శనివారం సాయంత్రం ఊయల సేవను కన్నుల పండువగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని, శ్రీ స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులయ్యారు. కొండెపి వసుంధర బృందం వీనులవిందుగా భక్తి గీతాలు ఆలపించింది. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ మాట్లాడతూ ప్రతి శనివారం సాయంత్రం 6గంటలకు ఊయల సేవను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి



బాపట్ల సూర్యలంక తీరంలో జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, అధికారులు, అభ్యాసకులు

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- సూర్యలంక తీరంలో యోగా దినోత్సవం
- వేలాది మంది హాజరు

బాపట్ల: యోగా వలన కలిగే లాభాలను, ప్రయోజనాలను తెలుసుకొని దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రజలకు సూచించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం సూర్యలంక బీచ్‌లో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. 10 వేల మంది పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మరాజు, చీరాల శాసన సభ్యులు ఎం.ఎం.మాలకొండయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో కేర్ యోగా నాచురోపతి మెడికల్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజులుగా యోగా కార్యక్రమాన్ని జిల్లాలో, మండలాల్లో, ప్రతి పంచాయతీలో జరుపుకుంటున్నామని తెలిపారు. జీవితాన్ని ఆహ్లాదంగా, సంతోషకరంగా మలచుకోవాలని ఉద్దేశంతో ఋషులు పరిశోధించారని అన్నారు. మనం దైనందిన జీవిత ప్రవాహంలో కొట్టుకుపోయే క్రమంలో చిన్న వయసులోనే వృద్ధులుగా తయారవుతున్నామని అన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామని అన్నారు. ఎక్కువ సంవత్సరాలు జీవించినప్పటికీ అది ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన, ఆనందదాయకమైన జీవితం గడపటం లేదని అన్నారు. యోగ వలన ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని తెలిపారు. జీవన క్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. యోగాను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఐక్యరాజ్యసమితికి పరిచయం చేసి ప్రపంచానికి పరిచయం చేసిన రోజు ఈ రోజు అని తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో సూర్యలంక బీచ్ లో జిల్లా స్థాయి యోగా దినోత్సవం ఇంత ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, జిల్లా అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

యువతను నట్టేట ముంచిన
కూటమి ప్రభుత్వం



యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మేరుగ చంద్ నాగ్, కొక్కిలిగడ్డ చెంచయ్య తదితరులు

- రేపు యువత పోరు
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మేరుగ చంద్‌నాగ్

బాపట్ల: రాష్ట్రంలో యువతను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు మేరుగ చంద్‌నాగ్ పేర్కొన్నారు. యువతకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచేందుకు ఈనెల 23వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. మేరుగ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు ఇస్తామని ఇచ్చిన హామీని నేరవేర్చలేదన్నారు. ప్రతి ఏడాదీ జనవరిలోనే జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెడుతున్నారని విమర్శించారు. యువత నేడు అయోమయ పరిస్థితిలో కూరుకుపోయిందన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం యువత పోరు కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, పార్టీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నక్కా వీరారెడ్డి, సెక్రటరీ దొంతిబోయిన జయభారత్‌రెడ్డి, జిల్లా అధికారప్రతినిధి వీరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాదరెడ్డి, శంకర్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు దొంతిబోయిన ఏడుకొండలరెడ్డి, మధు, మండల, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు ఉరబిండి గోపినాథ్, రవితేజ, సాగర్, షేక్ మౌలాలి, గోపి, నాయకులు వడ్డిముక్కల డేవిడ్, మహ్మద్ హుస్సేన్, జోగి రాజా, నర్రావుల వెంకట్రావు, మోర్ల సముద్రాల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు

- గేదెను ఢీకొట్టడంతో ఇంజిన్‌లో ఇరుక్కుపోయిన కళేబరం
- 26 నిమిషాల పాటు మొరాయించిన రైలు
- ఏం జరుగుతుందో అర్థం కాక ఆందోళన చెందిన ప్రయాణికులు
- ఘటనపై కేసు నమోదు చేసిన ఆర్పీఎఫ్ పోలీసులు



గేదెను ఢీకొట్టి చీరాల రైల్వేస్టేషన్ సమీపంలో నిలిచిపోయిన జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్

చీరాల రూరల్: బాపట్ల జిల్లా చీరాలలో జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు దాటుతున్న గేదెను ఢీకొట్టింది. దీంతో రైలు 26 నిమిషాల పాటు నిలిచిపోయింది. ఈ సంఘటన శనివారం సాయంత్రం సమారు 6:15 గంటలకు చీరాల రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్లే జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు చీరాల రైల్వేష్టేషన్ సమీపంలోకి రాగానే ఓ గేదె పట్టాలు దాటుతోంది. ఈ క్రమంలో ఎక్స్‌ప్రెస్ రైలు గేదెను ఢీకొట్టింది. ఈ సంఘటనలో గేదె కళేబరం ఇంజిన్‌లో ఇరుక్కుపోవడంతో ఇంజిన్ మొరాయించింది. ఒక్కసారిగా రైలు ఆగిపోవడంతో ఏమి జరిగిందో అర్థంకాక ప్రయాణికులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న రైల్వేశాఖాధికారులు, రైల్వే పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైలు ఇంజిన్ ముందుభాగంలో ఇరుక్కుపోయిన గేదె కళేబరాన్ని తొలగించారు. దీంతో రైలు యథావిధిగా సాగిపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

నేడు పూలింగ్ సమాయత్త సభలు

తాడికొండ: తాడికొండ మండలంలో పూలింగ్ కింద భూమి సేకరించేందుకు ఆదివారం సమాయత్త సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు మెహర్ కుమార్ శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు మోతడక, 11 గంటలకు లచ్చన్న గుడిపూడి, 12 గంటలకు ముక్కామల గ్రామాల్లో సభలు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో పాటు, స్థానిక అధికారులు, సీఆర్‌డీఏ అధికారులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

బాబూ.. మీకు న్యాయమా..!

మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయండి

- కూటమి ప్రభుత్వానికి సోషల్ మీడియాలో వినతుల వెల్లువ
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణం మొదలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిపివేసిన పనులు



పిడుగురాళ్ల సమీపంలోని కామేపల్లి వద్ద నిర్మాణం ఆగిన డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కళాశాల

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని కామేపల్లి వద్ద నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కళాశాల, వైద్యశాల పనులు తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న పల్నాడుకు చెందిన వారు కళాశాల వద్దకు సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మొత్తం 17 మెడికల్ కాలేజీలు వైద్యశాలలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో ఒకటి పిడుగురాళ్ల సమీపంలోని కామేపల్లి వద్ద డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కాలేజీ, వైద్యశాల భవనాల నిర్మాణ పనులు చేపట్టి దాదాపు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నిలిపివేశారు. మాచర్ల, గురజాల ప్రాంతాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే వారిని గుంటూరు, విజయవాడ తీసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. 150 కిలోమీటర్లు ప్రయాణిస్తే గాని వైద్యం అందని దుస్థితి. దూర ప్రాంతాల్లో ఉన్న హాస్పిటల్స్‌కి వెళ్లే లోపే అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అదే కామేపల్లిలో మెడికల్ కాలేజీ, వైద్యశాల నిర్మాణం పూర్తయితే ఎన్నో ప్రాణాలు నిలబడతాయి. ఈ నేపథ్యంలో కళాశాల, వైద్యశాల పనులు పూర్తి చేయాలని సెల్ఫీ వీడియోల ద్వారా సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పుడు వారి మాటల్లోనే విందాం....

పల్నాడు ప్రజలకు ఎంతో మేలు



పల్నాడు ప్రాంతంలో ప్రమాదాలు జరిగితే వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాలి. ఈలోగా ప్రాణాలు కోల్పోతున్నారు. డాక్టర్ వైఎస్సార్ వైద్యశాల, కళాశాల నిర్మాణం పనులు పూర్తయితే ప్రజలకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి సుమారు 90 శాతం పూర్తయిన వైద్యశాల, కళాశాలలు పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

–సురేష్, టెక్సాస్ (అమెరికా)

కళాశాల, వైద్యశాల నిర్మాణం పూర్తి చేయాలి



పల్నాడు ప్రాంతంలోని పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందాలనే సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ వైద్యశాల, కళాశాల నిర్మాణం చేపట్టి 90 శాతం పనులు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం వైద్యశాల నిర్మాణ పనులు నిలిపివేయటం దుర్మార్గం. ఇప్పటికైనా పనులు వెంటనే మొదలుపెట్టి పూర్తి చేయాలని చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేస్తున్నాం.

–సూర్య (ఆస్ట్రేలియా)

స్పందన అభినందనీయం



పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కామేపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్మాణం చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాల కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రతి ఒక్కరూ ముందుకు రావడం అభినందనీయం. స్థానికులే కాకుండా ప్రవాసాంధ్రులు సైతం సెల్ఫీ వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో సీఎం పేషీ దృష్టికి వెళ్లడం విశేషం. సుమారు 600 పడకల హాస్పిటల్, 500 మంది వైద్య విద్యార్థుల కోసం వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల సుమారు రూ. 540 కోట్లతో 90 శాతం పూర్తి చేశాం. కూటమి ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది. ఈ పనులు పూర్తి చేసేంతవరకు తమ పోరాటాలు జరుగుతూనే ఉంటాయి.

–మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2025 కౌన్సెలింగ్ శనివారం ప్రారంభమైంది. గుంటూరు నగర శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో సమన్వయకర్త టి. శేఖర్ పర్యవేక్షణలో సిబ్బంది విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. శనివారం ఒకటో ర్యాంకు నుంచి 15వేలు ర్యాంకు వరకు పూర్తయింది. ఆదివారం 15,001 నుంచి 32వేలు వరకు ర్యాంకు విద్యార్థులు హాజరుకావాలి. ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు నరసరావుపేట పల్నాడు బస్టాండ్ సమీపంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ పాత క్యాంపస్, రేపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, బాపట్లలోని బాపట్ల పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లోనూ విద్యార్థులు ఆయా తేదీల్లో ర్యాంకులు వారీగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని అధికారులు సూచించారు.

కృష్ణా నదిలో పడి న్యాయవాది మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

రేపల్లె: ప్రమాదవశాత్తూ కృష్ణా నదిలో పడి న్యాయవాది మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు కథనం ప్రకారం.. పట్టణంలోని 7వ వార్డుకు చెందిన కొండపల్లి శ్రీనివాసరావు (48) మానసిక ప్రశాంతత కోసం శుక్రవారం సాయంత్రం పెనుమూడి కృష్ణా నది వద్దకు వెళ్లాడు. కాసేపు పుష్కర ఘాట్‌పై సేదతీరి కాళ్లు కడుక్కోవడానికి నది ఒడ్డుకు వెళ్లాడు. కాళ్లు కడుక్కుంటూ ప్రమాదవశాత్తూ నదిలో పడి మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడు శ్రీనివాసరావు గతంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. శ్రీనివాసరావు మృతిపై బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

'కిల్లర్ లేడీ' ఆటకట్టు

- జంట హత్యల సూత్రధారి అరెస్టు ?
- మరో ఇద్దరితో కలిసి ఘోరాలు
- ఇప్పటికే పోలీసుల అదుపులో ఆ ముగ్గురు
- పోలీస్ విచారణలో మరికొన్ని నేరాలు వెలుగులోకి...!



పోలీసుల అదుపులో ఉన్న నిందితురాలు

తెనాలి: ఒకే ఇంట్లో ఇద్దరు వృద్ధ మహిళలను హత్య చేసి బంగారు నగలను అపహరించిన కేసులో మారీసుపేటకు చెందిన అత్తోట కుసుమ ప్రధాన సూత్రధారిగా పోలీసులు నిర్ధారణ కొచ్చారు. ఆమెను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. విచారణలో మరో వృద్ధురాలి హత్యతోపాటు, ఇంకొకరి హత్యకు రెక్కీ నిర్వహించినట్టు తెలిసి, ఆ కోణంలో దర్యాప్తు జరుగుతోందని విశ్వసనీయ సమాచారం. మారీసుపేట, మల్లెపాడులో కలకలం రేగింది.

ఇన్స్యూరెన్స్ ఏజెంటుగా వివరాల సేకరణ

తెనాలి పట్టణం మారీసుపేటలో కుసుమ నివాసం. ఆమె భర్త 15 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. ఇద్దరు సంతానం. కాలేజీకి వెళుతున్నారు. గతంలో 'మెప్మా' విభాగంలో తాత్కాలికంగా పని చేసింది. ప్రస్తుతం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీ ఏజెంటుగా పని చేస్తోంది. పాలసీల పేరుతో అందరినీ కలుస్తూ వారి వివరాల ఆధారంగా నేరాలకు ప్రణాళికను రచిస్తోంది. తన సహాయకులతో పక్కాగా అమలు చేస్తోంది. తెనాలి నుంచి చినపరిమి వెళ్లే రోడ్డులో మూతపడిన అప్పడాల కంపెనీ పైభాగంలో వితంతువులైన వియ్యపురాళ్లు దాసరి రాజేశ్వరి (65), పిట్టా అంజమ్మ (70) నివసిస్తున్నారు. ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం ఆ ఇద్దరు హత్యకు గురయ్యారు. వీరి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఈ కేసులో కుసుమ సహా ఆటోడ్రైవర్, మరొక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

హత్యకు ప్లాన్ ఇలా..

హత్యకు గురైన వృద్ధుల ఇంటికి ఆ రోజు ఒక ఆటోలో కుసుమ సహా మరో ఇద్దరు యువకులు వచ్చారు. 'ఆంటీ... ఇల్లు చూట్టానికి వచ్చారు...కిందకు రండి !' అని కుసుమ పిలవడంతో ఒక వృద్ధురాలు కిందకు వచ్చారు. కిందకు వెళ్లినామె ఎంతకీ పైకి రాకపోవటంతో ఇంకో వృద్ధురాలు, 'ఇంకా రాలేదేంటి...పైకి రా!' అని వియ్యపురాలిని కేకేసింది. దీనితో మళ్లీ కుసుమ, ఆమెను కూడా 'కిందకు రండి...పిలుస్తున్నారు !' అనడంతో ఆమె కూడా దిగివచ్చింది. తర్వాత ఆ ముగ్గురూ అదే ఆటోలో తిరిగి వెళ్లిపోయారు. ఇదంతా ఇంటిముందున్న సీసీ కెమెరాలో రికార్డు కావడంతో పోలీసులు కుసుమతో సహా ఆ ఇద్దరు యువకులను తెలిగ్గా పట్టుకోగలిగారు. విచారణలో వారు కూడా విస్తుపోయే మరికొన్ని నిజాలు తెలిసినట్టు విశ్వసనీయ సమాచారం.

వృద్ధురాలి మృతి వెనుక కూడా ఆమె హస్తం

కుసుమ నివాసానికి ఎదురుగానే రోడ్డుకు అవతల ఒంటరిగా నివసిస్తున్న ఓ వృద్ధురాలు రెండు వారాల క్రితం చనిపోయింది. ఆ సమయంలో ఆమె ఒంటిపై గాట్లు ఉండటం, బంగారు నగలు కనిపించకపోవటాన్ని బిడ్డలు గుర్తించారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అంత్యక్రియలు చేశారు. ఆ వృద్ధురాలి మృతి వెనుక కుసుమ, ఆమె బ్యాచ్ హస్తమున్నట్టు నిర్ధారణకొచ్చారు.

మోసానికి ప్రతిరూపం చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి



'జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిన హనిమిరెడ్డి, నాయకులు

అద్దంకి: 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నలభై ఏళ్ల అనుభవం అని చెప్పుకొచ్చే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరవాత ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. చంద్రబాబు అంటే మోసం అనేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా తన తండ్రి తరువాత రాజకీయాల్లోకి వచ్చి పార్టీ పెట్టి, అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పకుండా హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్ జగన్ అంటే నమ్మకం అని ప్రజలు అనుకునేలా చేశారని తెలిపారు. ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవి వాస్తవాలు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'యువత పోరు' జయప్రదం చేయండి

అద్దంకి: బాపట్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయర్త పానెం చిన హనిమిరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శనివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. నిరసన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున యువత తరలి రావాలని కోరారు.

బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యలు అనుచితం

అద్దంకి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై టీడీపీ నాయకుడు బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలు అనుచితమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ తీరుపై మండిపడ్డారు. బుచ్చయ్య చౌదరికి నిబద్ధత ఉందా అని ప్రశ్నించారు. ఆయన మొదట ఎన్టీఆర్ వద్ద నుంచి లక్ష్మీపార్వతి దగ్గరకు, ఆ తరువాత చంద్రబాబు వద్దకు వచ్చాడన్నారు. నాలుగు మాటలు చెప్పి బాబును మెప్పించి మంత్రి పదవి పొందాలనే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన మాటలు వింటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన ప్రతి కార్యక్రమానికి వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేక ఏదో విధంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు అడ్డంకులు కల్పిస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామని చెప్పిన సూపర్ సిక్స్ హామీల ఊసే నేడు లేదన్నారు. సంవత్సరం గడిచినా హామీలు నెరవేర్చకపోవడంతోనే ప్రజలు వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ పట్టం కట్టాలనే ఆలోచనకు వచ్చారని చెప్పారు. దాని ఫలితమే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కార్యక్రమాలకు అనూహ్యంగా లభిస్తున్న జనాదరణ అన్నారు. జమిలి ఎన్నికలు అంటున్నారని.. మరో రెండు సంవత్సరాల్లో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజారిటీలో గెలవడం ఖాయమని చెప్పారు. సమావేశంలో అద్దంకి మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, బల్లికురవ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, కొరిశపాడు మండల కన్వీనర్ పాలపర్తి శ్రీధర్, బీసీ సెల్ అధ్యక్షుడు గోలి రమణబాబు, కొల్లా భువనేశ్వరి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 64 మందికి ఉద్యోగాలు

నిజాంపట్నం: మండల కేంద్రమైన నిజాంపట్నంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌కు కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న 144 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 64 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరిదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిక్రూట్‌మెంట్ మేళాలో ఎంఎస్ మహేంద్ర ఆటో పయనీర్ వరల్డ్, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, నిర్మల ఇండస్ట్రీస్, పవర్ సర్వీసెస్, బెంగళూరు గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్‌లతో పాటు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు. విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేశారన్నారు. ఎంపికైన వారికి అప్రంటీస్ శిక్షణ నిచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో భృతి అందించనున్నట్లు వివరించారు.

మార్టూరులో గడ్డివామి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక కేంద్ర సిబ్బంది

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో శనివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో వరిగడ్డి వామి దగ్ధమైంది. స్థానిక తూర్పు బజారుకు చెందిన పుట్టా విలాస్ బాబు గొడ్ల చావిడిలో ఉన్న వరి గడ్డి వామిపై బాణసంచా పడటంతో మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో చిలకలూరిపేట నుంచి వచ్చిన అగ్నిమాపక కేంద్ర సిబ్బంది మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 60 వేల ఆస్తినష్టం జరిగినట్లు రైతు వాపోయారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

తల్లీకూతుళ్లకు స్వల్ప గాయాలు



పెదకాకాని: గ్యాస్ సిలిండర్ పేలి తల్లీకూతుళ్లకు గాయాలైన సంఘటన శనివారం మండలంలోని తక్కెళ్లపాడులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాటా సామ్రాజ్యం కుమార్తెలు భూలక్ష్మి, కృష్ణకుమారి ఇటీవల పుట్టింటికి వచ్చారు. వారితో పాటు భూలక్ష్మి కుమార్తె అలేఖ్య కూడా వచ్చింది. ఆమె ప్రస్తుతం గర్భిణి. ఏడాది పాప ఉంది. అంతా కలసి పిండివంటలు చేసుకుంటున్నారు. ఈ సమయంలో గ్యాస్ సిలిండర్ నుంచి పొగలు రావడంతో సామ్రాజ్యం, భూలక్ష్మి, కృష్ణకుమారి బయటకు పరుగులు తీశారు. బెడ్‌రూంలో ఏడాది పాప ఉండటంతో అలేఖ్య లోపలకు వెళ్లి తలుపులు వేసుకుంది. బయటకు వెళ్లిన వారు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని గది తలుపులు పగులగొట్టి, అలేఖ్య, ఆమె కుమార్తెను క్షేమంగా బయటకు తీసుకు వచ్చారు. కొద్దిసేపటికే సిలిండర్ పెద్ద శబ్దంతో పేలడంతో సామ్రాజ్యం, ఆమె కుమార్తె భూలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

యువతకు స్ఫూర్తి రాజేంద్రప్రసాద్ జీవితం



ప్రత్యేక తపాలా కవరు విడుదల చేస్తున్న బి.కె.రావు

తెనాలి: సైన్యంలో దేశ రక్షణ విధుల్లో కొనసాగి, బయటకొచ్చాక వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించి క్రీడారంగ అభివృద్ధికి తోడ్పడుతూ సమాజసేవలో కొనసాగుతున్న చలసాని బాబూ రాజేంద్రప్రసాద్ జీవితం నేటియువతకు స్ఫూర్తిదాయకమని ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బి.కె.రావు అన్నారు. రాజేంద్రప్రసాద్ నిర్వహిస్తున్న సీబీఆర్ అకాడమీ రజతోత్సవాల సందర్భంగా తపాలా శాఖ తీసుకొచ్చిన ప్రత్యేక కవరును శనివారం సాయంత్రం తెనాలిలోని ప్రధాన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. సభకు మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. రాజేంద్రప్రసాద్ నినాదం 'విన్ ఫర్ ఇండియా...డై ఫర్ కంట్రీ' తనను ఎంతగానో ఆకర్షించిందని బీకే రావు చెప్పారు. రాజేంద్రప్రసాద్ సేవల్ని గుర్తించి తపాలశాఖ ప్రత్యేక కవరును విడుదల చేయడంఅభినందనీయమని తెలిపారు. తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసు మాట్లాడుతూ దేశభక్తుడి గురించి ప్రత్యేక కవరును విడుదల చేయటం సంతోషంగా ఉందన్నారు. సైనిక్ వెల్ఫేర్ బోర్డు బ్రిగేడియర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ సంపాదించిన డబ్బును సమాజ సేవకు వినియోగిస్తున్న మాజీ సైనికుడు సీబీఆర్ ప్రసాద్‌ను భారత ప్రభుత్వం గుర్తించాలని అభిప్రాయపడ్డారు.

జాబ్‌మేళాలో 60 మందికి ఉద్యోగాలు

పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీ రావు



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో తమ్మాజీరావు

పిడుగురాళ్ల: జాబ్ మేళాలో 60 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీ రావు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదేశాలతో ఈ జాబ్‌మేళా నిర్వహించారు. తమ్మాజీ రావు మాట్లాడుతూ జాబ్‌మేళాకు 10 కంపెనీలు హాజరు కాగా, 214 మంది నిరుద్యోగులు హాజరయ్యారని, అందులో 60 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.వి.కృష్ణారెడ్డి, జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి ఎం.రవీంద్ర నాయక్, పిడుగురాళ్ళ స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ పి.శ్రీకాంత్, వీరాంజినేయులు, రమ్య, అంజిరెడ్డి, సురేష్, మస్తాన్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై అధికార పార్టీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని పార్టీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ అశోక్ కుమార్ అన్నారు. పిడుగురాళ్లలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పట్టుకుని నిన్ను చంపేస్తే తప్పేముంది. అంటూ అధికార పార్టీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడటం దుర్మార్గమన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని హెచ్చరించారు. దీనిపై సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

భర్తపై భార్య కత్తితో దాడి

నరసరావుపేటటౌన్: భర్తపై కత్తితో దాడికి పాల్పడిన భార్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.విజయ్ చరణ్ శనివారం తెలిపారు. షాలెంనగర్‌కు చెందిన జంపాని అజయ్ కుమార్‌కు రొంపిచర్ల మండలం అన్నవరం గ్రామానికి చెందిన ధనుషలకు మూడేళ్ల క్రితం వివాహమైంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు వచ్చి ధనుష ఇటీవల పుట్టింటికి వెళ్లింది. భర్త ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరగా, శనివారం షాలెంనగర్‌కు వచ్చింది. మళ్లీ భార్యా, భర్తల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో ఇంట్లో ఉన్న కూరగాయలు కోసే కత్తితో అజయ్ కుమార్‌పై ధనుష దాడికి పాల్పడింది. స్థానికులు క్షతగాత్రుడిని ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



శైలజ (ఫైల్)

పట్నంబజారు: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకరగుంట సమీపంలోని సైక్లోన్ అపార్ట్‌మెంట్‌లో నివసించే నరహరి శైలజ (54) భర్త శ్రీనివాసరావుకు మార్కెట్‌లో కిరాణా దుకాణం ఉంది. ఇద్దరు సంతానం ఉన్నారు. కుమార్తెకు వివాహం అవ్వగా, కుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం జిన్నాటవర్ సెంటర్‌లోని ఒక దుకాణంలో దుస్తులు కొనుగోలు చేసేందుకు శైలజ వచ్చారు. అక్కడ కొనుగోలు చేసి కిందకు దిగారు. అప్పుడే గుంటూరు– 1 డిపో నుంచి క్రోసూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆపబోయాడు. ఈ క్రమంలో శైలజ బస్సు ముందు నుంచి నడిచి వెళ్తుండగా, గమనించని డ్రైవర్ ముందుకు నడిపాడు. బస్సు టైర్ కింద పడి శైలజ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు.

ప్రత్యామ్నాయ పంటలను సూచించండి

యడ్లపాడు: ఈ ఏడాది పొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా ఏ పంటలు వేయాలో ప్రభుత్వం రైతులకు సూచించాలని, అదేవిధంగా ఆయా పంటలకు గిట్టుబాటు ధర సైతం కల్పిస్తామనే గ్యారెంటీని రైతులకు ఇవ్వాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. యడ్లపాడు మండలం మైదవోలు – వంకాయలపాడు పరిధిలోని స్పైసెస్ పార్కులోని జిల్లా పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. నాణ్యత సాకులు చూపకుండా, షరతులంటూ ఇబ్బందులు పెట్టకుండా రైతుల పొలాల్లోని నిల్వలన్నింటినీ పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలన్నారు.

భార్యను హతమార్చి, గొంతు కోసుకున్న భర్త


- ఆసుపత్రికి తరలించిన పోలీసులు
- గుంటూరు కన్నవారి తోటలో ఘాతుకం



దారబోయిన లక్ష్మి, రాజు దంపతులు (ఫైల్)

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : భార్యపై అనుమానంతో గొంతు కోసి హత మార్చి.. తానూ గొంతు కోసుకొని భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన గుంటూరు నగరంలోని కన్నవారితోటలో శనివారం మధ్యాహ్నం జరిగింది. మృతురాలు లక్ష్మి కుమారుడు శివ తెలిపిన వివరాల ప్రకారం...కన్నవారితోటలోని రఘురామ్‌నగర్ గోరీలదొడ్డి ప్రాంతానికి చెందిన దారబోయిన లక్ష్మి (40), భర్త రాజులకు ఇద్దరు సంతానం ఉన్నారు. లక్ష్మి ఇళ్లల్లో పని చేస్తుంటుంది. భర్త వంట పనులు, కూలీ పనులకు వెళుతుంటాడు. లక్ష్మికి 17 ఏళ్ల కిందట వేరే వ్యక్తితో వివాహమైంది. భర్త వేధింపులు భరించలేక అతడ్ని వదిలేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో వంట పని చేసుకుంటూ బతుకుతోంది. అదే కళాశాలలో వంట పని చేసే రాజు పరిచయం కాగా, ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చి గుంటూరు కన్నవారితోటలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. కొద్ది కాలంగా రాజు, భార్యని అనుమానించడం ప్రారంభించాడు. నిత్యం మద్యం తాగి అసభ్యపదజాలంతో వేధించడం ప్రారంభించాడు. రెండు నెలలుగా పనికి వెళ్లకుండా భార్యని కూడా ఇంట్లోనే ఉండాలంటూ వేధిస్తున్నాడు. శనివారం ఉదయం భార్యాభర్తల మధ్య వివాదం జరిగింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో గట్టిగా కేకలు వినిపించడంతో స్థానికులు సమాచారం అందించడంతో నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి చూసే సరికి ఇద్దరు రక్తపు మడుగుల్లో పడి ఉన్నారు. అప్పటికే లక్ష్మి మృతి చెందింది. రాజు కొనఊపిరితో ఉన్నాడు. పోలీసులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్, అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు, నగరంపాలెం ఎస్ఐ రమాదేవి సిబ్బందితో ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. లక్ష్మిని భర్త మెడ వంచి వెనుక భాగం నుంచి కత్తితో కోసి ఉన్నట్లు గుర్తించారు. అదే కత్తితో రాజు గొంతు కోసుకున్నట్లు గుర్తించారు. క్లూస్ టీమ్ ఘటనా ప్రదేశానికి చేరుకుని ఆధారాలను సేకరించింది. లక్ష్మి మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించారు. కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులు లేక ప్రయాణికులకు ఇక్కట్లు



వైజాగ్‌కు తరలించడంతో అవస్థలు

పట్నంబజారు: అంతర్జాతీయ యోగ డే సందర్భంగా జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు వైజాగ్‌కు తరలి వెళ్లడంతో ప్రయాణికులు రెండు రోజులుగా ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైజాగ్‌లో శనివారం నిర్వహించిన యోగాంధ్రా కార్యక్రమానికి గుంటూరు జిల్లా, బాపట్ల జిల్లాల నుంచి భారీ సంఖ్యలో బస్సులను తరలించారు. గుంటూరు డిపో –1 నుంచి 35, గుంటూరు డిపో –2 నుంచి 35, తెనాలి డిపో –25, మంగళగిరి–20, పొన్నూరు– 20, బాపట్ల– 18, రేపల్లె –22, చీరాల – 18, అద్దంకి నుంచి 22 బస్సులను యోగాంధ్రాకు తరలించారు. దీంతో పల్లె ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కళాశాలలు, పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు బస్సులు కిక్కిరిసి కనిపించాయి. మూడు కార్గో బస్సులను మెకానిక్‌లతో కలిపి వైజాగ్‌కు పంపడంతో ఇక్కడ గ్యారేజీల్లో వారి కొరత ఏర్పడినట్లు తెలుస్తుంది. ఫిట్‌గా లేని బస్సులను గ్యారేజీ నుంచి బయటకు తీయకుండా అలాగే ఉంచారు. కొన్ని సర్వీసులు మాత్రమే నడిపారు. గతంలో సైతం రాజధాని ప్రాంతానికి ప్రధాని నరేంద్ర మోదీ వచ్చినప్పుడు బస్సులను తీసుకెళ్లడంతో ఇబ్బందులు పడినట్లు ప్రయాణికులు వాపోయారు.